

అర్హులందరికీ పింఛన్లు

రంపచోడవరంలో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, పీవో, సబ్ కలెక్టర్, పార్టీ పరిశీలకుడు కర్రి పాపారాయుడు



విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

• డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

8లో

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. పొగమంచు తీవ్రత లేనప్పటికీ చలిగాలులు విజృంభిస్తున్నాయి. తేలికపాటి జల్లులు కురిశాయి. పాడేరు మండలం మినుములూరులో 13 డిగ్రీలు, చింతపల్లిలో 14.5 డిగ్రీలు, అరకులోయలో 15.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

న్యూస్‌రీల్

మరో మూడు రోజులు ఉచిత బియ్యం పంపిణీ

సాక్షి,పాడేరు: జిల్లాలోని మరో మూడు రోజుల పాటు ప్రధానమంత్రి గరిబ్ కళ్యాణ్ యోజన పథకం ద్వారా డిసెంబర్ నెలకు సంబంధించి ఉచిత బియ్యాన్ని డీఆర్ డిపోల ద్వారా పంపిణీ చేస్తామని జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాస్ తెలిపారు. డిసెంబర్ నెలలో అనివార్య కారణాల వల్ల ఉచిత బియ్యాన్ని చాలామంది పొందలేకపోయారన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించడంతో ఈ నెలలో మూడురోజులపాటు ఉచిత బియ్యం సరఫరాకు అవకాశం కల్పించిందన్నారు. ఈనెల 7వ తేదీ వరకు ఉచిత బియ్యాన్ని డీఆర్ డిపోల్లో పొందవచ్చని ఆయన పేర్కొన్నారు.

నేడు ఎలక్టోరల్ పరిశీలకుడు అహ్మద్‌బాబు పర్యటన

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర జిల్లాల ఎలక్టోరల్ పరిశీలకుడు అహ్మద్‌బాబు గురువారం నుంచి జిల్లాలో పర్యటిస్తారని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఉదయం 7గంటలకు విశాఖలో బయలుదేరి 10 గంటలకు పాడేరు చేరుకుంటారని ఆయన పేర్కొన్నారు. ఉదయం 10.30గంటలకు కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహిస్తారన్నారు.ఎన్నికల జాబితాలకు సంబంధించి ఎన్నికల విభాగం ఈఆర్వో, ఏఈఆర్వోలతో సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటల తరువాత ఆయన విశాఖకు బయలుదేరుతారని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల విభాగం అధికారులంతా సమగ్ర నివేదికలతో ఈ సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

కండీషన్ బస్సులను నడపాలని వినతి



ఆగిపోతున్న కృష్ణదేవిపేట - చింతపల్లి బస్సు

గూడెంకొత్తవీధి: జిల్లాలోని ఘాట్ రోడ్లలో కండిషన్ సరిగ్గా ఉన్న బస్సులను నడపాలని ఆర్టీసీ ఉన్నతాధికారులను కోరినట్టు పెదవలస సర్పంచ్ సాగిన కృష్ణవంశీ, వైఎస్ఎంపీపీ ఆనందరావు, ఉపసర్పంచ్ కుమారి తెలిపారు. నర్సీపట్నం నుంచి చింతపల్లి వరకూ ఉదయం తొమ్మిదిగంటల సమయానికి రంపుల మీదుగా వచ్చే బస్సు ఒక్కటే ఉందన్నారు. కృష్ణదేవిపేట చింతపల్లి ట్రిప్పుల బస్సు తరచూ మరమ్మతులతో ఆగిపోతోందన్నారు. రెండు రోజుల వ్యవధిలో పలుమార్లు మరమ్మతులకు గురైందన్నారు. దీంతో ఈప్రాంత ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి కండీషన్‌లో ఉన్న బస్సులను నడపాలని ఆర్టీసీ డీఎంను కోరినట్టు వారు తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ ప్రసాద్ పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

అడ్డతీగల: నవోదయ విద్యాలయం ఎటపాకలో ఆరవ తరగతిలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో వై.మల్లేశ్వర్రావు కోరారు. ఈ మేరకు నవోదయ విద్యాలయ సమితి నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఈనెల 31 వరకూ దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉందన్నారు. ఏప్రిల్ 29న ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలతోనమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

మిర్చి రైతు విలవిల

వరదల నుంచి గట్టెక్కిన విలీన మండలాల రైతులను చీడపీడలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గోదావరి వరదలు వల్ల పంట నష్టం చవిచూసిన రైతులు మిర్చి సాగుపై ఆశలు పెట్టుకున్నారు. రూ.లక్షల్లో అప్పులు చేసి పెట్టుబడి పెట్టారు. పూత దశలో తామర పురుగు, ఎర్రనల్లి ఆశించి రసం పీల్చేయడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. పెట్టుబడి దక్కని పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- తామర పురుగుతో తీవ్ర నష్టం
- రసం పీల్చేయడంతో దిగుబడిపై ప్రభావం
- పెట్టుబడులు కోల్పోయే పరిస్థితి
- దిక్కుతోచని స్థితితో అన్నదాత



పూతకు ఆశించిన తామర పురుగు



తామరపురుగు బారిన పడిన మిర్చి తోటలు

ఎటపాక: ఆరుగాలం కష్టించి పండించిన పంటలను తామర పురుగు (త్రిప్స్ పార్విస్పైనస్) నాశనం చేస్తోంది. రూ.లక్షల పెట్టుబడులతో సాగు చేపట్టిన వాణిజ్య పంట మిర్చిపైరు తెగుళ్లు ముప్పేట దాడి చేస్తున్నాయి. రైతు కోలుకోలేని విధంగా దెబ్బతీస్తున్నాయి. జిల్లాలో అత్యధికంగా విలీన ప్రాంతాలైన ఎటపాక, కూనవరం, వీఆర్‌పురం మండలాల్లో సుమారు 4,500 ఎకరాల్లో మిర్చి సాగు చేపట్టారు. ఎటపాక మండలంలోని సుమారు 2,700 ఎకరాల్లో పంట వేశారు. గోదావరి వరదల కారణంగా మొదటి దశ పంటలు పత్తి, వరి నాశనమవడంతో రైతులంతా మిర్చి సాగుపైనే ఆధారపడ్డారు. ఈ నేపథ్యంలో పైరుపై తామరపురుగు విలయ తాండవ చేస్తోంది. అన్నదాతలకు తీరని నష్టం కలిగిస్తూ కన్నీరు పెట్టిస్తోంది.

పూత, పిందె దశలో..

ఈఏడాది పూత, పిందె దశలో మిర్చి పంటపై తామర పురుగు, ఎర్రనల్లి ఆశించింది. రసం పీల్చేయడంతో దిగుబడి పడిపోయింది. ఆకుల్లోని రసాన్ని పీల్చేయడంతో గిడసబారిపోతున్నాయి. వీటి నివారణకు సస్యరక్షణ చేపట్టినా ఫలితం లేకపోయిందని రైతులు వాపోతున్నారు. వీటి తీవ్రత ఎక్కువగా ఉండటంతో దిగుబడులపై ఆశలు వదులుకున్నారు. కళ్లదుటే పూత, ఆకులు రాలి తోటలు ఎండిపోతుండటంతో తల్లడిల్లిపోతున్నారు. మురుమూరు,నందిగామ,గొరిదేవిపేట నెల్లిపాక,వీఆర్ పురం ప్రాంతాల్లో అధిక విస్తీర్ణంలో పండిస్తున్నారు.

కౌలుకు తీసుకొని..

సెప్టెంబర్ నుంచి ఏప్రిల్ వరకు మిర్చి సాగు చేపట్టేందుకు చాలా మంది రైతులు భూమిని కౌలుకు తీసుకుంటారు. ఎకరాకు రూ.20 నుంచి రూ.25 వేలు వరకు కౌలు చెల్లిస్తారు. అంతేకాకుండా సాగు యాజమాన్యం, సస్యరక్షణ, అంతర కృషికి సుమారు రూ.1.20 వరకు కేటాయించారు. పంట సాగు చేపట్టకముందు భూములు గోదావరి వరదలకు ముంపునకు గురవడంతో ఈ ఏడాది తెగుళ్ల బెడద ఉండదని రైతులు ఆశించారు. దీంతో ఎకరాకు 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఆశపడ్డారు. తెగుళ్ల ప్రభావం కారణంగా ఎకరాకు కనీసం రెండు క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు.

విలీన మండలాల్లో సాగు వివరాలు

మండలం	సాగు (ఎకరాల్లో)
ఎటపాక	2700
కూనవరం	1150
వీఆర్ పురం	400
చింతూరు	150

మిర్చి తోటల పరిశీలన

ఎటపాక మండలంలో నెల్లిపాక, తోటపల్లి ప్రాంతాల్లో తెగుళ్ల ఆశించిన మిర్చి పంటను ఉద్యానవనశాఖ జిల్లా అధికారి రమేష్‌కుమార్, డివిజన్ అధికారి రమేష్ పరిశీలించారు. నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.



మిర్చి తోటలను పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖ అధికారులు

నష్టమే మిగిలింది



గత ఏడాది నాలుగు ఎకరాల్లో మిర్చి సాగు చేస్తే రెండు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పూత, కాపు లేకపోవడంతో నష్టపోయా. ఈ ఏడాది తామర పురుగు ఆశించింది. రసం పీల్చేయడంతో దిగుబడి గణనీయంగా పడిపోయింది.

–ఆరవ కామేశ్వరరావు, రైతు, నందిగామ

పెట్టుబడి దక్కని పరిస్థితి



తెగుళ్ల, పురుగుల నివారణకు సస్యరక్షణ చేపట్టినా అదుపులోకి రాలేదు. ఎన్నడూ లేనంతగా మిర్చితోటలకు తీవ్ర నష్టం కలుగజేశాయి. పెట్టుబడులు భారీగా పెరిగిపోయాయి. దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. కనీసం పెట్టుబడి దక్కని పరిస్థితి నెలకొంది.

–ఆకుల నాగేంద్రరావు, రైతు, గొరిదేవిపేట

నాణ్యత ప్రమాణాలు పాటించండి

- పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశం
- మారుమూల ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన
- గ్రామసచివాలయం, పాఠశాలల తనిఖీ
- విద్యార్థుల సామర్థ్యం పరిశీలన



దిగు కుమడ పాఠశాల విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న పీవో గోపాలకృష్ణ

పెదబయలు: మండలంలోని మారుమూల గ్రామాల్లో ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. అభివృద్ధి పనులు, పాఠశాలలను తనిఖీ చేశారు. జామిగుడ గ్రామానికి నిర్మిస్తున్న రోడ్డు పనులు పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. దిగు కుమడ పాఠశాలలో ఆధార్ కార్డు లేక బడిలో చేరని విద్యార్థులకు రెండు రోజుల్లో ఆధార్ కిట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పూల బంద పాఠశాలకు సున్నం వేయించాలని, విద్యార్థులు కూర్చోవడానికి చాపలు కొనుగోలు చేయాలని ఆదేశించారు. జామిగుడ గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సచివాలయంలో మెరుగైన పౌర సేవలు అందించాలని ఆదేశించారు. కుమడ, పూలబంద, జామిగుడ పాఠశాలలను తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల హాజరు పెంచాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన మెనూ అందించాలని,విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రతీ తరగతిలోను క్లాస్ లీడర్లను నియమించాలని స్పష్టం చేశారు. తాగునీటి సదుపాయంపై ఆరా తీశారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఏయూ ఈఈ కె.లావణ్యకుమార్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ల తనిఖీ

సౌకర్యాలు పరిశీలించిన ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఏజీఎం శరద్ కుమార్ శ్రీవాత్సవ



అరకులోయలో రైల్వే అధికారులతో సమీక్షిస్తున్న ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఏజీఎం శరధ్ కుమార్ శ్రీవాత్సవ

సాక్షి, పాడేరు: అరకులోయలోని యండపల్లివలస రైల్వేస్టేషన్‌ను ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఏజీఎం శరద్ కుమార్ శ్రీవాత్సవ బుధవారం తనిఖీ చేశారు. విశాఖ నుంచి కిరండోల్ రైలులో ప్రయాణించిన ఆయన అరకులోయలోని యండపల్లివలస రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ఇక్కడ అధికారులంతా ఏజీఎం శ్రీవాత్సవకు స్వాగతం పలికారు. రైల్వేలోని పలువిభాగాల అధికారులతో కలిసి ఆయన యండపల్లివలస రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛ కార్యక్రమాలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పర్యాటకులు, ప్రయాణికులకు రైల్వేస్టేషన్‌లో అందుబాటులో ఉన్న అన్ని సౌకర్యాలను క్షేత్రస్థాయిలో తనిఖీలు జరిపారు. అలాగే కొత్తవలస-కిరండోల్ ప్రధాన రైలు మార్గంలోని అన్ని రైల్వే స్టేషన్లలో ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు, కల్పించాల్సిన సౌకర్యాలపై ఆయన సమీక్షించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ సిగ్నల్ అండ్ టెలికాం ఇంజనీర్ దిప్తాన్స్‌శుశ్మ, సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (సెంట్రల్) ప్రభాత్‌సింగ్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం

- కలెక్టర్ సుమిత్ కుమార్
- బ్యాంకర్లు, అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, చిత్రంలో ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలోని చదువుకుని ఖాళీగా ఉన్న యువతీ, యువకులను గుర్తించి చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహిస్తామని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. బుధవారం రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏడు మండలాలకు సంబంధించిన బ్యాంకు మేనేజర్లు, వెలుగు ఏపీడీ, డీపీఎంలతో ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా యువతీ, యువకులను గుర్తించి రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం, ఒడుగు వికాస పథకంలో వచ్చిన దరఖాస్తులు, మంజూరు యూనిట్లు, పెండింగ్ వివరాలను ఆయన తెలుసుకున్నారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఒక్కొక్క మండలంలో పదిమంది లబ్ధిదారులను ఎంపిక చేసి, రుణాలు మంజూరైన లబ్ధిదారులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పోలవరం ప్రాజెక్ట్ ముంపునకు గురైన రైతులకు వ్యవసాయ నిమిత్తం ట్రాక్టర్లు కావలసిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. మారేడుమిల్లి మండలం గుడిసె పర్యాటక ప్రాంతానికి వచ్చే టూరిస్టులకు వాహనాలు అద్దెకు ఇచ్చేలా ఆసక్తి గల వారి నుంచి కూడా దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. ముందుగా లబ్ధిదారులు తీసుకున్న రుణాలకు సక్రమంగా కట్టిన వారిని రెన్యువల్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. దరఖాస్తుదారుడికి రుణాలు మంజూరు చేసే ముందు సిబిల్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించారు. అటవీ హక్కుల చట్టం ద్వారా పట్టాలు పొందిన రైతులకు నిబంధనల ప్రకారం రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను కలెక్టర్ ఆదేశించారు. ఏజెన్సీలో రైతులందరికి క్రాప్ లోన్లు మంజూరు చేయాలని సూచించారు. సారా తయారు చేసి అమ్ముతూ పట్టుబడిన వారిని గుర్తించి, వారు మళ్లీ ఆ వృత్తిపై దృష్టి పెట్టకుండా చిన్న, చిన్న వ్యాపారాలు చేసుకునే విధంగా రుణాలు మంజూరు చేయాలని అధికారులకు సూచించారు.

నేడు సీఎం వైఎస్ జగన్ యలమంచిలి రాక

విశాఖ డెయిరీ చైర్మన్ తులసీరావుకు నివాళులర్పించనున్న ముఖ్యమంత్రి



యలమంచిలి రాజీవ్ క్రీడా మైదానంలో హెలీప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ గౌతమీ సాలి, జేసీ కల్పనాకుమారి

సాక్షి, అనకాపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం యలమంచిలికి రానున్నా రు. గన్నవరం నుంచి బయలుదేరి విశాఖ ఎయి ర్‌పోర్టుకు ఉదయం 11.20 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో యలమంచిలి వెళ్తారు. మధ్యాహ్నం 12 గంటలకు విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు ఇంటికి చేరుకుంటారు. ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించి, వారి కుటుంబసభ్యులను పరామర్శిస్తారు. 12.25 గంటలకు తిరిగి పయనమై ఒంటి గంటకు విశాఖ ఎయిర్‌పోర్ట్‌కి చేరుకుంటారు. అక్కడ నుంచి 1.10 గంటలకు విమానంలో బయలుదేరి 2 గంటలకు గన్నవరం చేరుకుంటారు.

నిబంధనలు పాటించాల్సిందే

డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు

చింతపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పాడేరు డీడీ కొండలరావు అన్నారు. బుధవారం చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాల వార్డెన్లు, హెచ్ఎంలు, ఏటీడబ్ల్యూవోలతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్ద పీట వేస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అందుకు అనుగుణంగా పాఠశాల యాజమాన్యం పనిచేయాలని ఆయన సూచించారు. బాలికల పాఠశాలల్లో పూర్తి స్థాయి ఉపాధ్యాయులను నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. మెనూ అములో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మెనూ పెట్టాలని ఆయన సూచించారు. ఉపాధ్యాయులు సమయానికి విధులకు హాజరు కావాలని లేకుంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డీడీ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డి, కొయ్యూరు, చింతపల్లి, అనకాపల్లి ఏటీడబ్ల్యూవోలు క్రాంతికుమార్, జయనాగలక్ష్మి, నాగశిరీష , పలువురు హెచ్ఎంలు, వార్డెన్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం



గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, చిత్రంలో సీడీపీవో లక్ష్మీదేవి తదితరులు

గూడెంకొత్తవీధి: మండలంలోని వంచుల, అసరాడ, కొట్నాపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ సూర్యలక్ష్మి బుధవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను, పోషకాహారాన్ని క్రమం తప్పకుండా అందజేయాలన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ వంటి కార్యక్రమాల అమలు ద్వారా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేస్తోందన్నారు. అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు సీమంతం నిర్వహించారు.

క్షీర సాగరుడు.. సేవాతత్పరుడు

రైతుల్లో రైతుగా.. వారికి పెద్దన్నగా నిలిచారు. పొట్ట చేతపట్టుకు వలసపోయే దుస్థితి లేకుండా తమ గ్రామాల్లోనే గౌరవప్రదంగా బతికేట్టు చేశారు. వాళ్లకు ఏ అవసరం వచ్చినా డెయిరీ ఉందంటూ ధీమానిచ్చారు. ఇందుకోసం అహర్నిశలూ శ్రమించారు. పాడిరైతుల పెన్నిధి ఆయన. వారి కుటుంబాలకు కార్పొరేట్ వైద్యం.. వారి పిల్లలకు చక్కని చదువులు.. గ్రామాల్లో వంతెనలు, కల్యాణ మండపాల నిర్మాణం.. ఇలా చెప్పుకుంటూ పోతే ఆడారి తులసీరావు చేసిన పనులు, సాధించిన ఘనతలు కోకొల్లలు. పదో తరగతి కూడా పాసవని ఒక వ్యక్తి తన జీవిత కాలంలో ఇన్ని పనులు చేశారంటే ఆశ్చర్యంగా ఉంటుంది. స్ఫూర్తివంతం.. ఫలవంతం ఆయన జీవితం.



తులసీరావుకు మునగపాకలో పౌరసన్మానం చేస్తున్న మంత్రులు ముత్యాలనాయుడు, అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి (ఫైల్)



మునగపాక/అనకాపల్లి రూరల్: సామాన్య రైతు కుటుంబంలో పుట్టారు.. అసామాన్యుడిగా ఎదిగారు.. ఆంధ్రా కురియన్‌గా పిలుచుకునే ఉత్తరాంధ్ర దిగ్గజం ఆడారి తులసీరావు ఒక వ్యక్తి కాదు వ్యవస్థ. 1986లో విశాఖ డెయిరీ చైర్మన్‌గా ఆయన పగ్గాలు చేపట్టారు. ఆ రంగంలో అపూర్వ విజయాలు సాధించారు. విశాఖ డెయిరీ సామర్థ్యాన్ని ఇప్పుడు 9 లక్షల లీటర్ల స్థాయికి తీసుకువచ్చారు. ఆయన చైర్మన్‌గా ఎన్నికైనప్పుడు 50 సొసైటీలు ఉండగా ఇప్పుడవి 1700 సొసైటీలు, 3,700 పాలసేకరణ కేంద్రాల వరకూ విస్తరించాయి. రూ.11 కోట్ల టర్నోవర్ ఉన్న డెయిరీని అంచెలంచెలుగా అభివృద్ధి చేసి ప్రస్తుతం రూ. 2 వేల కోట్ల టర్నోవర్ కంపెనీగా అభివృద్ధి చేశారు. 40కి పైగా దేశాల్లో పర్యటించి అధ్యయనం చేసి పాడిపరిశ్రమ రంగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చారు.

సేవల్లోను అగ్రస్థానం

విశాఖ డెయిరీ అభివృద్ధి విషయంలోనే కాకుండా రైతులకు, డెయిరీ కార్మిక కుటుంబాలకు అవసరమైన సేవలను అందించడంలో కూడా ఆయన ఎల్లప్పుడూ ముందున్నారు. గ్రామాల్లో ఎన్నో రహదారులు, 40 కాలువలు, లెక్కలేనన్ని కల్వర్టులు, రెండు రిజర్వాయర్లు, 20 కల్యాణ మండపాలు నిర్మించారు. పాల ఉత్పత్తిదారులకు, వారి కుటుంబ సభ్యులకు విద్య, వైద్యం విషయంలో బాధ్యత తీసుకొన్నారు. రైతుల పిల్లలకు నర్సింగ్‌లో శిక్షణ ఇప్పించి ఉద్యోగాలను వేయించారు. అంగవైకల్యం ఉన్న అనేకమందికి డెయిరీలో ఉద్యోగాలిచ్చి ఆశ్రయం కల్పించారు. డెయిరీ లాభాల్లో పాల ఉత్పత్తిదారులకు వాటా ఇచ్చారు. రైతులకు పశుగ్రాసం అందించడానికి కృషి చేశారు. మునగపాక మండలంలోని మెలిపాక నుంచి యాదగిరిపాలెం మీదుగా యలమంచిలి చేరుకునేందుకు వీలుగా రూ.8.5 కోట్ల వ్యయంతో తులసీ వారధి నిర్మించారు. మునగపాకలో కళాప్రదర్శనల కోసం తులసీ కళావేదిక ఏర్పాటుకు రూ.25 లక్షలు మంజూరు చేశారు. అక్కడే రూ.75 లక్షల వ్యయంతో కళ్యాణమండపం నిర్మించారు. మిల్క్ ప్రొడ్యూసర్ ఎంప్లాయిస్ ఎడ్యుకేషన్, హెల్త్-మెడికల్ వెల్ఫేర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ద్వారా వైద్యసేవలందించారు. పాఠశాలలు, జూనియర్ కాలేజీ, నర్సింగ్‌కాలేజీలను ఏర్పాటు చేసి ఉచితంగా విద్య నందించారు. దాదాపుగా 1700 గ్రామాలకు మంచినీటి సౌకర్యం కల్పించారు. 1500కు పైగా గ్రామాల్లో వ్యవసాయ బోర్ వెల్స్ ఉచితంగా ఏర్పాటుచేశారు.

ఇంతింతై వటుడింతై....

యలమంచిలిలో ఆడారి వెంకట రమణయ్య, సీతయమ్మ దంపతులకు తులసీరావు 1939లో జన్మించారు. ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన తులసీరావు పెద్దగా చదువుకోలేనప్పటికీ ఎన్నో విజయాలు సాధించారు. ఆయన తాత ఆడారి వీరినాయుడు అప్పట్లో విశాఖ జిల్లా బోర్డు సభ్యుడిగా రాజకీయాల్లో వుండేవారు. ఆయన వారసత్వం తులసీరావుకు వచ్చింది. రాజకీయ సువాసనలు ఒంట బట్టించుకున్న తులసీరావు 24 ఏళ్ల చిన్నవయస్సులోనే 1963లో యలమంచిలి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 1968, 1981 ఎన్నికల్లో కూడా సర్పంచ్‌గా గెలిచారు. మధ్యలో 11 ఏళ్లు ఎన్నికలు జరగకపోయినా ఆయనే పెద్ద దిక్కుగా వుండేవారు. ఆయన కుమార్తె పిల్లా రమాకుమారి రెండుసార్లు యలమంచిలి సర్పంచ్‌గా సేవలందించారు. ప్రస్తుతం యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న ఆయన కుమారుడు ఆనంద్‌కుమార్ విశాఖ డెయిరీకి వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.

ఆంధ్రా కురియన్ ఆడారి

గాజువాక/అక్కిరెడ్డిపాలెం: తులసీరావు సుమారు నాలుగు దశాబ్దాల కిందట జిల్లాలోని ఏ ఇతర ప్రాంతాలకూ గాజువాక నుంచి రవాణా సౌకర్యం కూడా సరిగ్గాలేని రోజుల్లో డెయిరీని గాజువాకలో ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్రలోని అన్ని ప్రాంతాల్లోనూ పాల వ్యాపారం విస్తరించేందుకు గాజువాకను ఆనాడే కేంద్రంగా ఎన్నుకున్నారు. ప్రారంభ దినాల్లో ప్రతిరోజు 3 నుంచి 4 వేల లీటర్ల పాలను సేకరించి సరఫరా చేసేవారు. తులసీరావు కృషితో ఆ సేకరణ ప్రస్తుతం రోజుకు 9 లక్షల లీటర్లకు చేరింది. పాల సేకరణతోపాటు విశాఖ డెయిరీని బహుముఖంగా అభివృద్ధి చేశారు. అనేక రకాల పాల ఉత్పత్తులు, నెయ్యి పెరుగు, లస్సీ, మిఠాయిలను అందుబాటులోకి తీసుకొచ్చారు. డెయిరీ విస్తరణలో భాగంగా రాజమండ్రిలో 2013లో మరోప్లాంట్ ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా వరకు పాల ఉత్పత్తుల్లో విశాఖ డెయిరీని నంబర్ వన్‌గా నిలబెట్టారు. దానికి ఆధునిక టెక్నాలజీని జోడించి పాల కొరత లేకుండా చర్యలు చేపట్టారు. సహజంగా వేసవి కాలంలో పాలకు కొరత ఉంటుంది. ఈ కొరతను అధిగమించడానికి ఎక్కువ పాలను సేకరించి వాటిని పొడిగా చేసి అందిస్తున్నారు. టెట్రా ప్యాక్, నిల్వ ప్యాకెట్లు తయారు చేసి వినియోగదారులకు నిరంతం అందుబాటులో ఉంచుతున్నారు. విశాఖ డెయిరీ ఉత్పత్తులను విదేశాలకు సైతం ఎగుమతి చేస్తున్నారు. అందుకే ఆయన పాల ఉత్పత్తిలో ఆంధ్రా కురియన్‌గా కీర్తినందుకున్నారు.

క్లుప్తంగా

భూములకు హక్కు పత్రాలు

రంపచోడవరం
ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రంపచోడవరం: ఏజెన్సీలో ప్రభుత్వ, ప్రైవేట్ భూములను సర్వే చేసి హక్కు పత్రాల మంజూరు చేయడం జరుగుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో భూ హక్కు, భూ రక్ష కార్యక్రమంలో రీసర్వే చేసిన భూములకు హక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ కుటుంబంలో ఒక యాజమాని పేరుమీద ఎక్కువ భూమి ఉండటం ద్వారా ప్రభుత్వ పథకాలు చాలామంది పొందలేక పోతున్నారన్నారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం భూహక్కు, భూరక్ష పథకం ద్వారా రైతులకు సంబంధించిన భూములకు సర్వే చేసి హక్కు పత్రాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. భూముల సర్వే సమయంలో రైతులు తప్పకుండా అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే ధనలక్ష్మి సూచించారు.

వడ్డాది పెద్దేరు నదిలో మునిగి వ్యక్తి మృతి


మృతి చెందిన వెంకట రమణ

బుచ్చెయ్యపేట: బుచ్చెయ్యపేట మండలం వడ్డాదికి చెందిన ఎర్రంశెట్టి వెంకట రమణ(59) పెద్దేరు నదిలో బహిర్భూమికి వెళ్లి మృతి చెందాడు. బుధవారం తన సమీప కుటుంబ సభ్యులు ఒకరు మృతి చెందడంతో ఆమె అంత్యక్రియలకు వెళ్లి వచ్చాడు. బహిర్భూమికని ఇంటి నుంచి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి పెద్దేరు కాలువలో పడి పోయాడు. స్థానికులు వెంటనే నీటిలో నుంచి బైటకు తీయగా అప్పటికే ఆయన మృతి చెందాడు. ఇతనికి భార్య చిలుకమ్మ, ఇద్దరు మగ పిల్లలు, ముగ్గురి కుమార్తెలు ఉన్నారు. వెంకట రమణ వడ్డాది జంక్షన్‌లో చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ పెద్ద మృతితో కుటుంబ సభ్యులు భోరున విలపించారు. బుచ్చెయ్యపేట ఎస్ఐ కుమారస్వామి వెంకట రమణ భౌతికాయాన్ని అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

అర్హులందరికీ పింఛన్లు


పాడేరులో కొత్తగా మంజూరైన పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి


పెదకోడాపల్లిలో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ


పింఛన్లు పంపిణీలో మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

పాడేరు రూరల్: దేశంలోకెల్లా ఎక్కువ మందికి అధిక మొత్తంలో పింఛన్‌సొమ్మును అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని.. అది సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వల్లే సాధ్యమైందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. పాడేరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన పింఛన్ వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ నెలలో ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పింఛన్‌ను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల మేరకు ఏటా పింఛన్ సొమ్ము పెంచుకుంటూ వెళ్తున్నారన్నారు. పింఛన్ సొమ్ముతో పేదలకు ప్రభుత్వం ఎంతో భరోసా ఇస్తోందన్నారు. అర్హులందరికీ పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఎంపీపీ సొనారి రత్నకుమారి, ఎంపీడీవో సాయి నవీన్, సర్పంచ్‌లు బొంజుబాబు, సన్నిబాబు, చిట్టిబాబు, నీలకంఠం, అప్పలకొండ, చిట్టమ్మ, పార్వతమ్మ, సీతమ్మ, రవణమ్మ, నాయకులు, పింఛన్‌దారులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో దేశానికే మార్గదర్శకం: పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో మండల పరిధిలో కొత్తగా మంజూరైన 310 మందికి పింఛన్లను పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ దేశంలో మరెక్కడ లేని విధంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అత్యధిక శాతం పింఛన్ పంపిణీ జరుగుతోందన్నారు. పింఛన్ల పంపిణీలో మన రాష్ట్రం దేశానికి మార్గదర్శకంగా నిలిచిందన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పోడు వ్యవసాయం చేసుకుంటున్న 365 మంది గిరిజనులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్వోఎఫ్ఆర్ పట్టాలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పంపిణీ చేశారు. పట్టాలకు ప్రభుత్వం రైతు భరోసా పథకం అమలు జరుగుతుందన్నారు. ఎంపీడీవో లోహిత్ జయసాగర్, తహసీల్దార్ కె.అప్పలస్వామి, ఎంఈవో కె.నాగభూషణం, ఎంఈవో-2 సుందరమ్మ, సర్పంచ్‌లు కె.రాంబాబు, ఎస్.రాంబాబు, చిలకమ్మ, రాజులమ్మ, చినకుమారి, ఎంపీటీసీ సన్యాసిదొర, విజయకుమారి, నానాజీ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మత్స్యకొండం నాయుడు, మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ గాయత్రి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు నాగూరుబాబు, నాయకులు కళ్యాణం, రామకృష్ణ, కొండబాబు, ఛత్రపతి తదితరలు పాల్గొన్నారు.

అర్హత ఒక్కటే ప్రామాణికం: అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: అర్హులందరికీ పథకాలను ప్రభుత్వం అందజేస్తోందని, అర్హతే ప్రామాణికంగా మంజూరు చేస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని పెదకోడాపల్లి పంచాయతీలోని పెదకోడాపల్లి పంచాయతీ కేంద్రంలో ప్రభుత్వం కొత్తగా 50 మందికి మంజూరు చేసిన పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. నాయుకులు, అధికారులు గ్రామ సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రంపచోడవరం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, అనేక పథకాలు అమలుచేస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో బుధవారం కొత్త పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు కర్రి పాపారాయుడులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం పారదర్శకంగా పథకాలు అమలుచేస్తోందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా గుర్తించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నామన్నారు. రంపచోడవరం మండలంలో కొత్తగా మంజూరైన 207 మందికి, మారేడుమిల్లిలో 63 మందికి పింఛన్లు అందజేశామన్నారు. గోగుమిల్లిలో రీసర్వే నిర్వహించిన 47 మంది రైతులకు పట్టాలు పంపిణీ ఎంపీపీలు బందం శ్రీదేవి, సార్ల లలిత, జెడ్పీటీసీలు పండా వెంకటలక్ష్మి, గొర్లె బాలాజీ బాబు, కర్రం వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండా కుమారి, లక్కొండి రవికుమార్, సర్పంచ్ మంగా బొజ్జయ్య, ఎంపీటీసీలు వెంకటేశ్వర్లుదొర, పాపారావు, సాయిబాబు, కృష్ణకుమారి, మంగ, వంశీ, షేక్‌వలీ ఎంపీడీవో విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కొత్తగా మంజూరైన 483 నూతన పింఛన్లను అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి మండలాల లబ్ధిదారులకు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ గిరిజనుల సర్వోతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర రోడ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు కారు రాంబాబు, ఎంపీపీలు బొడ్డపాటి రాఘవ, కడబాల ఆనందరావు, రాజవొమ్మంగి జెడ్పీటీసీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏడీఎంహెచ్‌వో డాక్టర్ లీలాప్రసాద్

పాడేరు రూరల్: గర్భిణులు, శిశువులకు సకాలంలో వ్యాక్సిన్ అందేలా క్షేత్ర స్థాయి వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని పాడేరు ఏడీఎంహెచ్‌వో డాక్టర్ కె.లీలాప్రసాద్ అన్నారు. మండలంలోని కిండంగి, లగిసపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన సందర్శించారు. పౌష్టికాహారం పంపిణీపై ఆరా తీశారు. మాతా, శిశు మరణాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ద్వారా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యత, వాక్సినేషన్‌పై అవగాహన కల్పించారు. అనంతరం పాడేరు జిల్లా ఆస్పత్రిలోని గైనిక్ వార్డు, నవజాత శిశు సంరక్షణ కేంద్రాలను తనిఖీ చేశారు. గర్భిణులకు బర్త్ వెయిటింగ్ కేంద్రంలో చేర్పించి ఆస్పత్రిలో సుఖ ప్రసవాలు అయ్యేలా చూడాలన్నారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలను ఆస్పత్రిలో ఉన్న ఎన్ఆర్‌సీ కేంద్రంలో చేర్పించి మెరుగైన పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట జిల్లా డీటీసీవో డాక్టర్ విశ్వేశ్వరనాయుడు, ఎపిడమిక్ సెల్ హెల్త్ సూపర్‌వైజర్ గుల్లెలి సింహాద్రి, ఆరోగ్య విస్తరణాధికారి బి లక్ష్మణ్ తదితరులున్నారు.

విద్యార్థులకు తీవ్ర గాయాలు

బైక్ అదుపుతప్పి ప్రమాదం

రాజవొమ్మంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. విద్యార్థులు వానపల్లి వీర సాయి కిశోర్, మట్టా ఈశ్వరవంశీ ప్రయాణిస్తున్న మోటారుసైకిల్ అదుపు తప్పడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. గాయపడిన వీరిన తోటి విద్యార్థులు స్థానిక పీహెచ్‌సీకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి పంపించారు. వట్టిగెడ్డ రిజర్వాయర్ వద్దకు షికారుకు వెళ్లి తిరిగి రాజవొమ్మంగి వస్తుండగా ప్రమాదం జరిగింది. అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.

జాతీయ స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు నాగజ్యోతి


నాగజ్యోతి

రావికమతం: మండలంలోని కన్నంపేట ఎస్ఎన్ కాలనీ పాఠశాల హెచ్ఎం పి.వి.ఎం.నాగజ్యోతి జాతీయ స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఆలిండియా సివిల్ సర్వీస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో జిల్లా,రాష్ట్ర స్థాయి పోటీలను అనకాపల్లి, విజయవాడల్లో నిర్వహించారు. ఆ పోటీల్లో నాగజ్యోతి పవర్ లిఫ్టింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 5 నుంచి 9 తేదీ వరకూ న్యూఢిల్లీ త్యాగరాజ్ స్టేడియంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు నాగజ్యోతి బుధవారం బయలుదేరి వెళ్లారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

డీఎంహెచ్‌వో జమాల్‌బాషా


ఏటిపల్లిలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా


రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

మారేడుమిల్లి: ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం పట్ల సిబ్బంది ఎప్పటికప్పుడు తగిన శ్రద్ధ తీసుకోవాలని డీఎంహెచ్‌వో జమాల్ బాషా ఆదేశించారు. బుధవారం ఆయన మండలలోని బోదులూరు బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న వైద్యసేవల వివరాలను ఉపాధ్యాయుల నుంచి తెలుసుకున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం, పరిసరాల పరిశుభ్రత, రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ఆయన అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆరునెలలకు ఒకసారి తప్పనిసరిగా నులిపురుగు నివారణ మాత్రలు వేయాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. గర్భిణులు, బాలింతలు, శిశువులకు అందిస్తున్న పౌష్టికాహారం, వైద్య సేవలపై ఆరా తీశారు. గర్భిణులు, శిశువులకు సకాలంలో వ్యాక్సినేషన్ జరిగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులు, మందులను తనిఖీ చేశారు. గర్భిణులను బర్త్‌వెయిటింగ్ హాల్‌కు తరలించి సుఖ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని వైద్యసిబ్బందికి సూచించారు. ఫ్యామిలి ఫిజీషియన్ కార్యక్రమంలో వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు.

గంగవరం: మండలంలోని జడేరు గ్రామసచివాలయం పరిధిలో ఏటిపల్లిలో 104 ఫ్యామిలీ ఫిజీషియన్, వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న శిబిరాన్ని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా బుధవారం సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతీ మండలంలో ప్రతీరోజు 104 వైద్యశిబిరాలు నిర్వహించి మారుమూల గ్రామాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. జిల్లాలోని 22 మండలాల్లో ప్రతీ రోజు 22 వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఏడీఎంహెచ్‌వో అనూష, ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యాధికారి ధర్మరాజు, వాడపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిఆనంద్‌తేజ్, హెచ్‌వీ రత్నకుమారి, సత్యవతి, 104 డీఈవో మధు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రాజేంద్రపాలెం ఆరోగ్య కేంద్రం తనిఖీ

కొయ్యూరు: అల్లూరి జిల్లాలో మాతా శిశుమరణాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించామని జమాల్‌బాషా అన్నారు. బుధవారం ఆయన రాజేంద్రపాలెం ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాతా శిశుమరణాలను వీలైనంతవరకు తగ్గించాలన్న కృతనిశ్చయంతో ఉన్నామన్నారు. మందుల సరఫరాలో లోపం లేదన్నారు. ప్రతీ ఉద్యోగి విధిగా ఫేసియల్ గుర్తింపు యాప్‌లో హాజరు నమోదు చేసుకోవాలని కోరారు. లేకుంటే ఆబ్సెంట్‌గా నమోదవుతుందని తెలిపారు. ఆస్పత్రిని శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రసవానికి వచ్చిన వారితో ఆయన మాట్లాడారు. సర్పాలు అధికంగా వస్తున్నాయని, క్వార్టర్లలో నివాసం కష్టంగా ఉందని వైద్య సిబ్బంది వివరించారు. విధులకు వచ్చి కూడా హాజరు పట్టీలో సంతకాలు పెట్టని ఇద్దరిని ఆయన మందలించారు. మరోసారి ఇలాంటివి జరిగితే క్రమశిక్షణ చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన గిరిజనుడు మృతి


ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ నాగేశ్వరరావును అంబులెన్స్‌లో రాజమండ్రి తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

రాజవొమ్మంగి: ఈనెల 2వ తేదీ మండలంలోని కొంపల్లి గ్రామంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ కుంజం నాగేశ్వర్రావు (45) చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. నాగేశ్వర్రావు ఇంటి వద్ద వేపనూనె తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. అతనిని కుటీంబ సభ్యులు వెంటనే రాజవొమ్మంగి పీహెచ్‌సీకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం వైద్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేసారు. అతను అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణం తెలియరాలేదు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు వున్నారు.

అజోల్లా పెంపకంపై శిక్షణ


అజోల్లా పెంపకంపై శిక్షణ పొందుతున్న రైతులు

రంపచోడవరం: రైతులు ఎక్కువ పాలదిగుబడిని సాధించేందుకు అజోల్లాను పశువులకు పెట్టాలని తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చని కేవీకె కో-ఆర్డినేటర్ డాక్టర్ లలితా కామేశ్వరి అన్నారు. కేవీకెలో అజోల్లా గడ్డి పెంపకంపై రెండు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో కాకినాడ రైతు శిక్షణ కేంద్రం ఏడీ (పశుసంవర్ధకశాఖ) డాక్టర్ పీవీ వరప్రసాద్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అజోల్లా పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. కేవీకె మత్స్య విభాగ శాస్త్రవేత్త కె.వీరాంజనేయులు మాట్లాడుతూ అజోల్లా గడ్డిని పశువులు తినడం ద్వారా ఎక్కువ పాలతో పాటు వెన్నశాతం పెరుగుతుందన్నారు. కోళ్లకు అజోల్లా పెట్టడం ద్వారా గుడ్లు పెట్టే సంఖ్య, మాంసం శాతం కూడా పెరుగుతుందన్నారు. కాకినాడ రైతు శిక్షణ కేంద్రం వెటర్నరీ డాక్టర్ జయభరత్‌రెడ్డి, ఎండీ సాయికృష్ణ, కేవీకె శాస్త్రవేత్తలు క్రాంతికుమార్, ప్రవీణ్‌బాబు, రంపచోడవరం, గంగవరం, మండలాలకు చెందిన 35 మంది రైతులు పాల్గొన్నారు.

అనాథలకు ఆశ్రయం కల్పించడం వరం


ఆశ్రమాన్ని ప్రారంభిస్తున్న తెలంగాణ పోలీసు అకాడమీ ఏడీ గిరిధర్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి

నర్సీపట్నం: అనాథవృద్ధులకు ఆశ్రయం కల్పించి, సేవలు అందించడం గొప్ప వరమని తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్ రావుల గిరిధర్ అన్నారు. లండన్‌లో స్థిరపడిన హైదరాబాద్‌కు చెందిన బిక్కుమండ్ల చంద్రశేఖర్, బండి చంద్రమోహన్ సంయుక్తంగా అనకాపల్లి ఫౌండేషన్ పేరిట నర్సీపట్నం మండలం గబ్బాడ సమీపంలో అనాథాశ్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆశ్రమం ప్రారంభోత్సవానికి గిరిధర్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, ఎంపీపీ సుర్లతో కలిసి ఆయన ఆశ్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల అభీష్టం మేరకు చంద్రశేఖర్, చంద్రమోహన్ అనాథ వృద్ధులకు ఆశ్రమాన్ని నెలకొల్పారన్నారు. వీరు తలపెట్టిన సేవాకార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు సంపూర్ణ సహకారాన్ని అందించాలన్నారు. చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, ఎంపీపీ రాజేశ్వరి మాట్లాడుతూ అనాథ వృద్ధులకు ఆశ్రమం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమన్నారు. అనంతరం వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ విశాఖ డీఐజీ కృష్ణారావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గుడబండి నాగేశ్వరరావు, ఆరుగుల్ల రాజుబాబు, పెట్ల అప్పలనాయుడు, సర్పంచ్ ఈరెల్లి రాజేశ్వరి, కౌన్సిలర్ శ్రీకాంత్, ఆశ్రమం నిర్వాహకులు మాధవ్, కిల్లాడ రామకృష్ణ తదితర్లు పాల్గొన్నారు.

అంధుల జీవితాల్లో ఆశాకిరణం


లూయిస్ బ్రెయిలీ చిత్రాపటానికి పూలమాలవేస్తున్న ఎంఈవో త్రినాథరావు


హుకుంపేటలోని ర్యాలీలో మండల పార్టీ గౌరవ అధ్యక్షుడు చినసత్యం, ఐఈఆర్‌పీ చిన్నతల్లి

డుంబ్రిగుడ: స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రెయిలీ ఉపాధ్యాయురాలు అనుపమ రాజకుమారి మాట్లాడుతూ కంటి చూపు కోల్పోయిన వారి జీవితాల్లో వెలుగు నింపేందుకు లూయిస్ బ్రెయిలీ రూపొందించిన లిపి ప్రపంచవ్యాప్తంగా కంటి వెలుగుగా మారిందన్నారు. లూయిస్ బ్రెయిలీ జయంతిని ప్రపంచ బ్రెయిలీ దినోత్సవంగా జరుపుకుంటారన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో త్రినాథరావు తదితరులు లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బ్రెయిలీ రూపొందించిన లిపి అంధుల జీవితాల్లో ఆశాకిరణంగా నిలిచిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ సుబ్బారావు, ఇండియా సర్వీస్ సొసైటీ సెక్రటరీ డాక్టర్ ఈశ్వరరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: స్థానిక భవిత కేంద్రంలో బుధవారం నిర్వహించిన బ్రెయిలీ దినోత్సవం సందర్భంగా అంధ బాల బాలికలకు ఆటల పోటీలు, డ్రాయింగ్, డ్యాన్ పోటీలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల గౌరవ అధ్యక్షుడు గండేరు చినసత్యం, హెచ్ఎం కోటేశ్వరరావు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం బ్రెయిలీ లిపిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐఈఆర్‌పీ చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.

100 మంది క్షయవ్యాధిగ్రస్తుల దత్తత

అనకాపల్లిటౌన్: పరవాడ గ్రీన్‌వాల్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధి ఎ.నాగిరెడ్డి 100 మంది క్షయ వ్యాధి గ్రస్తులను దత్తత తీసుకున్నారు. వ్యాధి గ్రస్తులకు న్యూట్రీషియన్ ఫుడ్ అందించేందుకు రూ. 4,20,000 చెక్‌ను డీఎంహెచ్‌వో హేమంత్‌కు స్థానిక జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయంలో బుధవారం అందజేశారు. అంతకుముందు హేమంత్‌ను నాగిరెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిప్యూటీ డీఎంహెచ్‌వో శారదాబాయి, కంపెనీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.